నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | బుధవారం 15 మే 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

# బీఆర్ఎస్ శ్రేణులకు కృతజ్ఞతలు

**పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ విప్ బాల్క సుమన్**


కొప్పుల ఈశ్వర్


బాల్క సుమన్

చెన్నూర్, మే 14 : పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కోసం కష్టపడిన శ్రేణులు, ఓటర్లకు ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షోలను విజయవంతం చేశారని, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు పార్టీ గెలుపు కోసం అహర్నిశలు, శక్తి వంచన లేకుండా కృషి చేశారని, వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నామని పేర్కొన్నారు.

## సక్కు పూజలు


పూజలు చేస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

జైనథ్, మే 14 : పెండల్‌వాడలోని హనుమాన్ ఆలయంలో మంగళవారం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు పూజలు చేశారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలు ఆయురారోగ్యాలతో నిండూ నూరేళ్లు సుఖంగా ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఒడ్డుగూడ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

# తూకంలో మోసం

- ఒడ్డుగూడ కొనుగోలు కేంద్రంలో నిర్వాహకుల నిలువుదోపిడీ
- తక్కువ తూకం వచ్చేలా కాంటాలు సెట్ చేసి మరీ స్వాహా
- క్వింటాలుకు ఐదారు కిలోల తేడా
- అన్నదాతల ఆగ్రహం.. ధర్నా
- కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేకు ఫిర్యాదు

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/ దహెగాం, మే 14 : దహెగాం మండలం ఒడ్డుగూడ ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు రైతన్నలను నిలువుదోపిడీ చేస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. క్వింటాలుకు ఐదారు కిలోల చొప్పున దోచుకునేలా కాంటాలను సెట్ చేయడంపై రైతన్నల్లో ఆగ్రహం వ్యక్తమైంది. ఈ మేరకు మంగళవారం కొనుగోలు కేంద్రం వద్ద అన్నదాతలు ధర్నాకు దిగడంతో పాటు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేకు ఫిర్యాదు చేశారు.

### క్వింటాలుకు 5 నుంచి 6 కిలోలు మోసం

ఒడ్డుగూడ ధాన్యం కొనుగోలు కేంద్రంలో క్వింటాలుకు 5 నుంచి 6 కిలోల ధాన్యం తక్కువగా వస్తోంది. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు తూకం తక్కువ వచ్చేలా కాంటాల్లో సెట్టింగ్ మార్చారు. బస్తా ధాన్యానికి రెండు.. మూడు కిలోల ధాన్యం తక్కువగా చూపిస్తుండగా, క్వింటాలుకు ఐదారు కిలోల తేడా వస్తోంది. ఈ కేంద్రంలో ఇప్పటి వరకు 220 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. ఈ కేంద్రంపై అధికారుల పర్యవేక్షణ లేకపోవంతో నిర్వాహకులు ఇష్టానుసారంగా కొనుగోళ్లు చేపడుతూ రైతులను మోసం చేస్తున్నారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ. 2203 చొప్పున కొనుగోలు చేస్తుండగా, కొనుగోలు కేంద్రం నిర్వాహకుల తీరుతో రైతులు మోసపోక తప్పడం లేదు.

### వెలుగు చూసింది ఇలా...

ఒడ్డుగూడ గ్రామానికి చెందిన రైతు సత్తయ్య సోమవారం రాత్రి అదే ఊరిలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో 500 బస్తాల ధాన్యాన్ని విక్రయించాడు. తను అంచనా వేసుకున్న దిగుబడికి.. కేంద్రంలో వచ్చిన తూకానికి తేడా ఉండడంతో మంగళవారం ఉదయం కొనుగోలు కేంద్రానికి వెళ్లి తాను విక్రయించిన ధాన్యం బస్తాల్లోనుంచి ఒక బస్తాను తీసుకొళ్లి ప్రైవేట్ కాంటాపై తూకం వేయించారు. అధికారులు ఏర్పాటు చేసిన కేంద్రంలో 40 కిలోల 500 గ్రాములుగా ఉన్న ధాన్యం బస్తా.. అదే ప్రైవేట్ కాంటాపై 43 కేజీలు దూగింది. ఇలా నాలుగైదు బస్తాలను తూకం వేసి చూశాడు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో క్వింటాలుకు ఐదారు కిలోల ధాన్యం తక్కువగా చూపిస్తున్నట్లు గుర్తించారు. ఈ విషయాన్ని తోటి రైతులకు చెప్పడంతో వారంతా కలిసి కొనుగోలు కేంద్రం వద్ద ధర్నా చేశారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు తుమ్మిడి నారాయణ వల్లే తాము మోసపోయామంటూ రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో ఇతను పనిచేసిన గిరివెల్లి కొనుగోలు కేంద్రంలోనూ ఇలాంటి మోసాలకు పాల్పడ్డాడని రైతులు తెలిపారు.

### క్వింటాలుకు ఐదారు కిలోల చొప్పున..



*ఒడ్డుగూడ కొనుగోలు కేంద్రంలో 500 బస్తాల ధాన్యాన్ని అమ్మిన. తూకంలో మోసం చేస్తున్నట్లు నాకు అనుమానం వచ్చింది. దీంతో మళ్లీ కేంద్రానికి వెళ్లిన. నేను అమ్మిన బస్తాల్లో నుంచి కొన్నింటిని తీసి ప్రైవేట్ కాంటాపై తూకం వేసిన. క్వింటాలుకు ఐదారు కిలోల తేడా వచ్చింది. అధికారులు స్పందించి మాలాంటి రైతులకు న్యాయం చేయాలె. ఈ విషయంపై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశాం.*

**- సత్తయ్య, రైతు**

### రైతులకు న్యాయం చేస్తాం

*ఒడ్డుగూడ ధాన్యం కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న మోసం గురించి నాకు తెలిసింది. క్వింటాలుకు 5 నుంచి 6 కిలోల వరకు తక్కువగా తూకం వస్తున్నట్లు రైతులు ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులను పంపించి విచారణ జరిపిస్తా. తూకాల్లో మోసానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేస్తా.*

**- వినోద్‌కుమార్, డీసీఎస్‌వో**

# ధాన్యం కొనండి మహాప్రభో..

- కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోతున్న నిల్వలు
- నెల రోజులుగా రైతన్నల పడిగాపులు
- లారీల కొరతతో ఇబ్బందులు
- టార్పాలిన్లు లేక అద్దెకు తెచ్చుకుంటున్న వైనం
- భయపెడుతున్న వానలు
- ఆందోళనలో అన్నదాతలు


కుందేళ్లపహాడ్ వద్ద దారి పొడవునా పోసిన ధాన్యం కుప్పలు


దండేపల్లిలో వర్షానికి తడిసిన ధాన్యం (ఫైల్)

దండేపల్లి, మే 14 : ఆరుగాలం అష్టకష్టాలు పడి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతన్నలు పడిగాపులు కాస్తున్నారు. కొనుగోలు కేంద్రాలకు వడ్లు తెచ్చి నెల రోజులైనా కాంటా పెట్టకపోవడంతో అక్కడే జాగారం చేస్తున్నారు. మరో వైపు అప్పుడప్పుడూ వానలు పడుతుండగా, ఎక్కడ నష్టపోవాల్సి వస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారు.

### కొన్నది 50 వేల మెట్రిక్ టన్నులే..

మంచిర్యాల జిల్లాలో 288 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెల రోజులు దాటుతున్నా, ధాన్యం సేకరణ మాత్రం 50 శాతం కూడా పూర్తి కాలేదు. 1.76 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 50 వేల మెట్రిక్ టన్నుల పైచిలుకు ధాన్యాన్ని మాత్రమే సేకరించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. 20 వేల నుంచి 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తూకం వేయాల్సి ఉండగా, రైతులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నారు. ధాన్యం మిల్లులకు తరలించేందుకనుగుణంగా లారీలు సమకూర్చకపోవడం, హమాలీలను అందుబాటులోకి ఉంచకపోవడంతో నిల్వలు పేరుకుపోతున్నాయి. కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం తడవకుండా టార్పాలిన్లు ఇవ్వడంలో అధికారులు విఫలం కాగా, రైతులు అద్దెకు తీసుకువచ్చిన కవర్లను కప్పుతున్నారు. కొందరు రైతులు గత్యంతరం లేక ఫ్లెక్సీలు తెచ్చి కప్పుకుంటున్నారు.

### లారీల కొరతతో ఇబ్బందులు..

తూకం వేసిన ధాన్యాన్న తరలించడంలోనూ జాప్యం జరుగుతుండడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మిల్లుల్లో ధాన్యాన్ని దించుకోకపోవడంతో రోజుల తరబడి అక్కడే నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. ధాన్యంలో తాలు, తప్ప, విరిగిన నూక వస్తుందనే నెపంతో మిల్లర్లు కొర్రీలు పెడుతూ దించుకోవడం లేదు. అసలే లారీలు తక్కువ ఉన్నాయంటే.. దీనికి తోడు మిల్లర్లు వెంటనే దించుకోకపోవడం పెద్ద సమస్యగా మారింది.లారీలు రాక తూకం వేసిన బస్తాల నిల్వలు పేరుకుపోతున్నాయి.

### వడ్లు తెచ్చి నెల రోజులైంది



*ఏడెకరాల్లో వరి వేసిన. కోసి నెల రోజుల కింద ఇక్కడి సెంటర్‌కు తెచ్చిన. ఇప్పటి వరకు జోకుతలేరు. మూడు రోజుల కింద వానకు కొన్ని వడ్లు తడిసినయి. మొన్నటి వరకు వడ్లు మంచిగా ఎండినయి. జోకుడు ఆలస్యమయ్యేసరికి మస్తు ఇబ్బంది అయితుంది. రోజూ ఎండకు ఎండబెట్టి ఆరబెడుతూ కుప్ప జేసుకుంటున్నం. లారీలు రాక మస్తు పరేషాన్ అయితంది. బస్తాకు రెండు కిలోల కటింగ్ అంటున్నరు. మా గోడును పట్టించుకునే నాథుడే లేడు.*

**-బత్తుల రవి, రైతు, చింతపెల్లి**

### వడ్లు తూకం వేయాలె



*రెండెకరాల్లో వరి కోసిన. 15 రోజుల కింద వడ్లు ఇక్కడికి తెచ్చిన. అకాల వర్షాలతో ఇబ్బందిగా ఉంది. మొన్నటి వానకు వడ్లు తడిసినయి. తెచ్చిన వెంటనే కాంట పెడితే ఈ బాధలుండవు. వర్షానికి తడవకుండా కవర్లు అద్దెకు తెచ్చుకొని కప్పుకుంటున్నం. జోకుడు అయ్యేదాకా వడ్ల కుప్పకాడనే జాగారం అయితంది. ఓ దిక్కు వర్షాలు భయపెడుతున్నయి. ఇప్పటికైనా వడ్లు తూకం వేయాలె.*

**-మడావి రఘు, రైతు, కుందేళ్లపహాడ్**

# గులాబీ జెండా ఎగురుతుంది..

**ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి**


మాట్లాడుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ టౌన్, మే 14 : ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. ఆదిలాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపుకోసం నిరంతరం ప్రచారంలో పాల్గొన్న కార్యకర్తలు, నాయకులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. తమకు బలమైన కార్యకర్తలు ఉన్నారని, మండే ఎండలను సైతం లెక్కచేయకుండా ప్రతి ఒక్కరూ ప్రచారంలో పాల్గొన్నారన్నారు. ఈ సమావేశంలో సింగల్ విండో చైర్మన్ అలీబిన్ హైమద్, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదర్శి సలాం, నాయకులు భీమేశ్, రవి, సుగుణాకర్, అశోక్, బలరాం, తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

**ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య**


ప్రధాన రోడ్లపై తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

జైనూర్, మే 14 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉందని, ప్రతి ఒక్కరూ శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య కోరారు. సోమవారం రెండు వర్గాల మధ్య జరిగిన దాడుల నేపథ్యంలో మంగళవారం మండల కేంద్రంలోని దుకాణా సముదాయాలను మూసి వేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన రాహదారిపై వెళ్తున్న వాహనాలు తనిఖీ చేశారు. ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున ఎలాంటి సభలు, సమావేశాలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించరాదన్నారు.

# సీసీ కెమెరాల మెమోరీ చిప్‌లు ఎక్కడ?

- ఆ బాధ్యత మీదేనంటూ బీఎల్‌వోలకు టెక్నీషియన్ ఫోన్లు
- పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయితీ
- చివరకు దొరికాయనడంతో ఊపిరి పీల్చుకున్న వైనం

భీమారం, మే 14 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భీమారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలోని పోలింగ్ బూత్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం ఇంట్లో ఉన్న బీఎల్‌వోలకు టెక్నీషియన్ల నుంచి ఫోన్లు వచ్చాయి. బూత్‌లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల మెమోరీ చిప్‌లు లేవని, ఎక్కడో పోయాయని, వాటి బాధ్యత మీదేనంటూ బీఎల్వోలకు అతడు ఫోన్ చేశాడు. ఇందులో భాగంగా బీఎల్వో శారదకు కూడా పలుమార్లు ఫోన్ వచ్చింది, మెమోరీ చిప్‌ల విషయమై కరీంనగర్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని బెదిరించాడు. దీంతో ఆందోళన చెందిన ఆమె తన భర్త తాళ్లవేణుకు ఈ విషయం తెలిపింది. అతడు మీడియాకు సమాచారం ఇచ్చాడు. అనంతరం బీఎల్వోలు విజయ, దేవిక, దుర్గ, సంధ్య, శారద, ఆమె భర్త వేణు కలిసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. ఆ సమయంలో ఎస్ఐ రాములు పోలీస్ స్టేషన్‌లో లేరు. పోలీసు సిబ్బంది సదరు టెక్నీషియన్‌కు ఫోన్ చేయగా, సీసీ కెమెరాల మెమోరీ చిప్‌లు దొరికాయని అతడు చెప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సోమవారం ఎన్నికలు జరిగితే, సీసీ కెమెరాలు మంగళవారం తరలించడం ఏమిటని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన తనకు ఎస్ఐ రాములు ఫోన్ చేసి దురుసుగా ప్రవర్తించాడని, ఎవ్వరికి పడితే వారికి (మీడియాకు) ఫోన్ చేసి.. ఏది పడితే అదే చెబుతావా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారని వేణు ఆవేదన వ్యక్తం చేశాడు.

# స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట భద్రత

**రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్**


ముల్కల్ల ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ

మంచిర్యాల ఏసీసీ, మే 14 : ఈవీఎంల భద్రత కోసం స్ట్రాంగ్ రూంల వద్ద మూడంచెల పటిష్ట భద్రత, బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పెద్దపల్లి పార్లమెంట్ మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గాల ఈవీఎంల భద్రత కోసం హాజీపూర్ మండలం ముల్కల్ల ఐజా ఇంజినీరింగ్ కళాశాల, మంచిర్యాల స్ట్రాంగ్ రూంలను సందర్శించారు. భద్రత ఏర్పాట్లను పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ట్రాంగ్ రూంల దగ్గర 144 సెక్షన్‌తో పాటు మూడంచెల భద్రతా వ్యవస్థను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పోలీసులు, ఆర్మ్‌డ్ రిజర్వ్, కేంద్ర బలగాలు స్ట్రాంగ్ రూంల వద్ద పహారా కాస్తున్నాయన్నారు. ప్రమాదాలకు, అవకాశం లేకుండా అగ్నిమాపక పరికరాలను సైతం అధికారులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఏసీపీ పర్యవేక్షణలో సీఐ, ఇద్దరు ఎస్ఐలతో పాటు సిబ్బందితో 24/7 విధులు నిర్వహిస్తారన్నారు. అనంతరం అధికారులకు పలు సూచనలు, ఆదేశాలను జారీ చేశారు. సీపీ వెంట మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, టాస్క్ ఫోర్స్ మల్లారెడ్డి, రామగుండం సీఐ అజయ్ బాబు, మంచిర్యాల రూరల్ సీఐ అశోక్, మంచిర్యాల మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకట నర్సయ్య, ఎస్ఐలు ఉన్నారు.



స్ట్రాంగ్ రూం వద్ద పోలీస్ బందోబస్తు


స్ట్రాంగ్ రూంను సీజ్ చేయిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

# స్ట్రాంగ్ రూంలలో అభ్యర్థుల భవితవ్యం

- ముల్కల్ల ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో సామగ్రి భద్రం
- లెక్కింపు కేంద్రం వద్ద భారీ బందోబస్తు

హాజీపూర్, మే 14 : పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికలు సోమవారం ముగియగా, అభ్యర్థుల భవితవ్యం స్ట్రాంగ్ రూంలలో ఉంది. మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన వీవీప్యాట్‌లు, కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, పోస్టల్ బ్యాలెట్‌లు, ఈవీఎంలను సోమవారం అర్ధరాత్రి భారీ బందోబస్తు నడుమ హాజీపూర్ మండలం ముల్కల్ల శివారులోని ఐజా ఇంజినీరింగ్ కళాశాలకు తీసుకొచ్చారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచారు. ఓట్ల లెక్కింపునకు మరో 20 రోజులు గడువు ఉండగా, జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి. ఎన్నికల సాధారణ పరిశీలకులు రావేశ్ గుప్త, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర బదావత్ సంతోష్, పోలీస్ పరిశీలకుడు మనీశ్ చౌదరి, డీసీపీలు అశోక్‌కుమార్, ప్రకాశ్, బెల్లంపల్లి ఏఆర్వో, జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ (స్థానిక సంస్థలు), సభావత్ మోతీలాల్ (రెవెన్యూ), చెన్నూర్ ఏఆర్వో చంద్రకళ, మంచిర్యాల ఏఆర్వో, ఆర్డీవో రాములు సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌ను సీజ్ చేశారు. లెక్కింపు కేంద్రం పరిసరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలను చేశారు.


స్ట్రాంగ్ రూంలో భద్రపర్చిన ఈవీఎంలు, వీవీప్యాట్‌లు

# గుండెపోటుతో ఫిజికల్ డైరెక్టర్ మృతి


సదానందం (ఫైల్)

మంచిర్యాలటౌన్, మే 14 : రామకృష్ణాపూర్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న గడిగొప్పుల సదానందం (46) మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. మంచిర్యాలలోని గోపాల్‌వాడలోగల విద్యానగర్ కాలనీలో నివసించే సదానందం బెల్లంపల్లి నియోజకవర్గం కాసిపేట మండలం మల్కేపల్లిలో పీవోగా విధులు నిర్వహించి సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంటికి చేరుకున్నాడు. మంగళవారం ఉదయం యథావిధిగా మైదానానికి వెళ్లిన ఆయన ఇంటికి వచ్చిన అనంతరం గుడికి వెళ్లాడు. అప్పటికే కాస్త అలసటగా ఉండగా, తన రెండో కూతురుతో కలిసి ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు వెళ్లాడు. అక్కడ వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం మరో దవాఖానకు రెఫర్ చేశారు. ఐబీ ప్రాంతంలోని మరో ఆస్పత్రికి వెళ్లగా,, అక్కడ గుండెపోటుతో మృతిచెందాడు. సదానందంకు భార్య సంధ్య, ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు. పెద్ద కూతరుకు రెండు నెలల క్రతమే వివాహం జరిపించారు. ప్రస్తుతం ఆమె అమెరికాలో ఉంది. పెద్దకూతురు వచ్చిన తర్వాత గురువారం అంత్యక్రియలు నిర్వహిస్తారని బంధువులు తెలిపారు. కాగా, సదానందం మృతిపట్ల పీడీలు, ఉపాధ్యాయులు, కాలనీ వాసులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అందరితో కలిసిమెలిసి ఉండే ఆయన హఠాన్మరణం చెందడం పలువురిని కంటతడిపెట్టించింది.


ఇందారం ఓపెన్‌కాస్టు మట్టి తరలిస్తున్న లారీలను అడ్డుకున్న నిరుద్యోగులు

# ఓసీ మట్టి తరలిస్తున్న లారీల అడ్డగింత

జైపూర్, మే 14: శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఇందారం ఓపెన్‌కాస్టుగని నుంచి మట్టి తరలిస్తున్న లారీలను మంగళవారం స్థానిక యువకులు అడ్డుకున్నారు. ఓసీలో స్థానికులకు పనులు ఇవ్వకుండా ఇతర ప్రాంతాల వారికి పనులు కల్పిస్తున్నారంటూ మండిపడ్డారు. తమ విలువైన భూములు కోల్పోయామని, ఇండ్లు పగుళ్లు తేలుతున్నాయని, ధుమ్మూదూళితో అనేక ఇబ్బందులు పడుతున్నామని, పనులు మాత్రం ఇతర ప్రాంతాలవారికి కల్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువకులు మట్టి తరలిస్తున్న లారీలను అడ్డుకోవడంతో ఓసీ ప్రాజెక్టు అధికారి ఎం శ్రీనివాస్, స్థానిక అధికారులు యువకులకు నచ్చజెప్పారు. విడుతల వారీగా అవకాశాలు కల్పిస్తున్నామని, మట్టి తరలింపు లారీలను అడ్డుకోవడం సరికాదని యువకులకు నచ్చజెప్పి పంపించారు.